క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



కోపల్లె హైస్కూల్లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: మండలంలోని కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్–బ్యాడ్ టచ్, స్వీయ రక్షణ, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, శక్తి యాప్, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడాల గోపికి పరామర్శ



గోపిని పరామర్శిస్తున్న ముదునూరి మురళీకృష్ణం రాజు

వీరవాసరం: పాలకొల్లు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తమ్ముడు వెంకటసుబ్బయ్య (చిన్నా) ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో గురువారం నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణం రాజు గుడాల గోపి పరామర్శించారు. అనంతరం వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాశాల విద్యార్థుల జీవితాలతో చెలగాటం



బడుగు బాలాజీ

ఉండి: కళాశాల విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది డీ ఫార్మసీ, వెటర్నరీ అడ్మిషన్లు ఇంకా మొదలు కాలేదని మండిపడ్డారు. ఆగస్టు నెలలో కౌన్సెలింగ్ పూర్తయితే సీట్లు రానివారు మిగిలిన వాటిలో జాయిన్ అవుతారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఏం చేయాలో? తెలియని అయోమంలో విద్యార్థులు తల్లడిల్లుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అడ్మిషన్లు మొదలు పెట్టాలని కోరారు.

నేడు మానవత సంస్థ శాంతి ర్యాలీ

భీమవరం: మానవత సంస్థ 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భీమవరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తామని మానవత శాఖ భీమవరం చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం తాలూకా ఆఫీస్ ఆవరణలోని క్విట్ ఇండియా స్థూపం నుంచి వెంకటరామ టాకీస్, ప్రకాశం చౌక్, భీమవరం ఎంపీడీఓ ఆఫీస్ మీదుగా తిరిగి తాలూకా ఆఫీస్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

వైభవంగా వాడపల్లి వెంకన్న కల్యాణం

భీమవరం: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ నల్లం సూర్య చంద్రరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.

రేషన్ పంపిణీపై సమీక్ష

పాలకోడేరు: వృద్ధులకు, వికలాంగులకు డీలర్లంతా అందరూ బాధ్యతగా రేషన్‌ను డోర్ డెలివరీ చేయాలని తహసీల్దార్ ఎస్.భారతీ విజయలక్ష్మి ఆదేశించారు. గురువారంతన కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో సమీక్ష నిర్వహించారు. సీఎస్ డీటీ శేషయ్య, డీలర్లు దొంగ కృష్ణ, సాయి కృష్ణ, కొల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

పాలకోడేరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గొరగనమూడిలో ముంపునకు గురైన వరి పొలాలను గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు మల్లికార్జునరావు, క్షిరిజా రాణి, భువనేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. వారి వెంట భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, ఏఓ బి.సంధ్య ఉన్నారు.

అంతర్గత రహదారులు అధ్వానం



భారీ గోతులతో అధ్వానంగా ఉన్న కోలనపల్లి రహదారి



బురదమయంగా ఉన్న కాళ్లలంక రహదారి

ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

కాళ్ల: మండలంలో రాష్ట్ర రహదారితో పాటు అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే నీరు నిలబడి ప్రయాణం కష్టంగా మారుతుంది. కొన్ని రహదారులు భారీ గోతుల ఏర్పడడం తో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో శివారు గ్రామాలైన పల్లెపాలెం నుండి ఎస్సీ బోస్ కాలనీ గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. ఆక్వా చెరువులు విస్తరించడంతో నిత్యం భారీ వాహనాలు తిరుగుతూ ఉంటాయి. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. ఆ రహదారి వెంట ప్రయాణం అంటేనే ప్రయాణికులు, స్థానికులు భయపడుతున్నారు. గోతుల వల్ల వాహనాలు రిపేర్లకు వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి రహదారిని కనీసం మరమ్మత్తులను చేయాలని కోరుతున్నారు.

ప్రతిరోడ్డూ గోతులమయమే

మండలకేంద్రమైన కాళ్ల నుండి లంక రోడ్డు, అదేవిధంగా కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే రహదారి గోతులమయమైంది. కోలన్నపల్లి రహదారి కొంతమేర మరమ్మతులు చేసినప్పటికీ మిగిలిన కొంత భాగాన్ని వదిలేయడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో కొద్దిపాటి వర్షానికి భారీ గోతుల్లో వర్షపు నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా కాళ్ల లంక రోడ్డు గోతులతో బురదమయంగా మారింది. లంక రోడ్లో జగనన్న కాలనీ, ఆక్వా చెరువులు విస్తరించి ఉన్నాయి. నిత్యం ప్రయాణికులు, వాహనదారులు రైతులు ఆ రహదారి వెంటే వెళ్తుంటారు. ఈ రహదారుల ప్రయాణం జారుడుబల్ల మాదిరిగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి వెళ్లాలంటే ఇబ్బందులుపడాల్సి వస్తుందని కాలనీవాసులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో మరింత ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా కోపల్లె నుంచి వేంపాడు మీదుగా భీమవరం వెళ్లే రహదారి కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గోతులమయమైన రహదారులను నిర్మించాలని కోరుతున్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సత్కారం

వీరవాసరం: మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డి.సముద్రంఆగస్టు 15న ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాయకుదురు హైస్కూల్లో కానుకొలను శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ డి.సముద్రాన్ని ఘనంగా సత్కరించారు. కె.వీరాస్వామి, ఆర్. తులసీ ప్రదీప్, వి. శేఖర్, పి.గజేంద్ర గట్కర్, యూవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఆలయ పాలక వర్గ ప్రమాణ స్వీకారం



గణపతి

ఆకివీడు: అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆకివీడు పెద్దింటి అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయాల ఇన్‌స్పెక్టర్ తోట శ్రీనివాసరావు నూతన చైర్మన్ గొంట్లా గణపతి, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఈఓ అల్లూరి సత్యనారాయణరాజు, మోటుపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ పూర్తి అవగాహనతో ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఆంధ్ర ప్రదేశ్ తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం – 2007, 2011 నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని హైదరాబాదు ఆర్ఆర్‌టీసీ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వృద్ధులకు సంబంధించిన చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వయోవృద్ధుల అప్పిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సెక్రటరీ చిట్టి వెంకయ్య, భీమవరం అధ్యక్షుడు నల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఓకు వినతి

భీమవరం: తల్లిదండ్రుల ప్రాణరక్షణ, పోషణ, సంరక్షణ చట్టం–2007ను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడ్డాల నాగ సూర్య సత్యనారాయణ కోరారు. సీనియర్ సిటిజన్స్ జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట కార్యదర్శి కొటికలపూడి చిట్టి వెంకయ్య, గౌరవ అధ్యక్షుడు వీకే వీరారావు, ఎన్‌వీకె నాగేశ్వరరావు, మట్లపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం (ప్రకాశంచౌక్): సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం

వీరవాసరం: సీనియర్ సిటిజన్స్ ప్రభుత్వ రక్షణ పొందుతూనే మరోపక్క ప్రభుత్వం నుంచి హక్కులు పొందడానికి పోరాటం చేయాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్ నాయకుడు మేళం దుర్గాప్రసాద్ అన్నారు. వీరవాసరంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 80 సంవత్సరాల వయసు వరకు ఆరోగ్య సదుపాయం కల్పించాలని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా పాము కాటు, చర్మవ్యాధుల మందు వేసే దూసనపూడి కి చెందిన సవరం వేమన యోగితో వివిధ కులాలకు చెందిన 20 సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. పాలకొల్లు సంఘ అధ్యక్షుడు వంగా నరసింహారావు, జి.సత్యనారాయణ మూర్తి, పాకల రాము, వనిత క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ బి.లక్ష్మీ కళ్యాణి, గుద్దటి స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరం: సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న దృశ్యం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: జిల్లా కేంద్రమైన భీమవరంలో విద్యాసమస్యలు రోజురోజుకూ అధికమవుతున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి. గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగంలో విద్యార్థులు దోపిడీకి గురవుతున్నారన్నారు. పట్టణంలో పీజీ సెంటర్ లేక పేద మధ్య తరగతి విద్యార్థులు పీజీ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడుతూ మేము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జీఓ నెంబర్ 77ను రద్దు చేస్తామని అన్నారని గాని సంవత్సరకాలం గడుస్తున్నా ఇప్పటి వరకు జీవోను రద్దు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ ఇన్‌చార్జి భూషణ్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్ మాట్లాడుతూ, బి.సింధు, సాయి కృష్ణ, శ్రావణి, భాగ్యలక్ష్మి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆశ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి

భీమవరం: నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఆశ కార్యకర్తలకు నెలకు రూ.26,000 కనీస వేతనం ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం సీహెచ్ లక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ ఆఫీసులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన ఆశ కార్యకర్తలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న తణుకులో నిర్వహించే ఆశ వర్కర్స్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు డి.జ్యోతి, ఎల్.కుమారి, పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు

భీమవరం: మన ప్రకృతిని కాపాడుకోవాలంటే మట్టి వినాయక విగ్రహాలనే వాడాలని అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, శ్రీ వేంకటేశ్వర స్వామి మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం సర్ సీవీ రామన్ స్కూల్లో విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలనే వాడాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి బాలల్లో ఒక అంశంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్ అంతా కూడా ఆ మంచి అంశాన్నే అవలంభిస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పూజలో మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని అన్నారు. అనంతరం స్కూల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, ఉపాధ్యాయులు పార్వతి, వరలక్ష్మి, శైలజ, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను వాడాలంటూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో ఉత్సాహంగా 'పొలం పిలుస్తోంది'

వీరవాసరం: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు మేరకు వరి సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.బిన్సి బాబు తెలిపారు. గ్రామంలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల మోతాదును తగ్గించుకుని పంటలు పండించాలని సూచించారు. పంటలకు మేలు చేకూర్చే మిత్ర పురుగులు, నష్టం కలిగించే పురుగులను ప్రదర్శన చిత్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చికిలే మంగతాయారు, ఎంపీటీసీ సభ్యురాలు గుల్లిపల్లి విజయలక్ష్మి, ఆదిరెడ్డి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

గరగపర్రులో

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా నీటి యాజమాన్యం, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసరావు, డీఆర్సీ బాల నాగేశ్వరమ్మ, మండల వ్యవసాయ అధికారి సంధ్య తదితరులు పాల్గొన్నారు.



వీరవాసరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

సచివాలయం ఎదుట ఆమరణ దీక్ష

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో కుప్పనపూడి వెళ్లే రహదారి రోడ్డు మార్జిన్ ఆక్రమణ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆక్రమణ తొలగించాలని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని సచివాలయం ఎదుట గురువారం వర్ధినీడి లక్ష్మీ వర ప్రసాద్ ఆమరణ దీక్ష చేపట్టారు. ఎండలో నాలుగు గంటల పాటు నిరసన దీక్ష చేపట్టడంతో సచివాలయ ఏఎన్ఎం,ఆశా వర్కర్లు రక్త పరీక్ష, సుగర్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, బీజేపీ మండల అధ్యక్షురాలు ఎం.నాగమణి ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు మాట్లాడడంతో ఆయన సంఘటనా స్థలానికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను ప్రసాద్ విరమించారు.



లక్ష్మీ వర ప్రసాద్‌కు రక్తపరీక్షలు చేస్తున్న దృశ్యం.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

భీమవరం: కౌలు రైతులందరికి గుర్తింపుకార్డులిచ్చి, అన్నదాత సుఖీభవ పథకం కింద నగదును అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం భీమవరంలోని ఉపాధ్యాయ భవనంలో కవురు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కౌలురైతుల సంఘం జిల్లా మహాసభలు సెప్టెంబర్ 7,8 తేదీల్లో పోడూరు మండలం కవిటం గ్రామంలో పరశురామరెడ్డి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి.బలరాం, ఎం.రామాంజనేయులు, ఇంజేటి శేఖర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పాలకుల వైఖరి సరికాదు



వీరవాసరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



ఉండి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కాళ్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వీరవాసరం: తీవ్రమైన పని ఒత్తిడి గురవుతున్న అంగన్‌వాడీలపై పాలకుల వైఖరి సరికాదని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు ధ్వజమెత్తారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా నల్ల చీరలు ధరించి గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు తప్ప మరో మార్గం లేదని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని నినదించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎఫ్ ఆర్ ఎస్ పేరుతో అంగన్వాడీలను ప్రధాన సేవల నుంచి పక్కదారి పట్టించి ఆన్‌లైన్ సేవల పేరుతో పాలకులు వేధిస్తున్నారని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పి.నాగరత్నం, సత్యవతి, లక్ష్మి, నిర్మల వెంకటలక్ష్మి, ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మండలాధ్యక్షుడు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిమాండ్లు నెరవేర్చాలంటూ మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై పెంచిన పనిభారాన్ని తగ్గించాలని కోరారు

కాళ్లలో..

కాళ్ల: గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ జిల్లా నాయకుడు మండా సూరిబాబు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు దావులూరి మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: 33/11 కేవీ కొవ్వాడ విద్యుత్ ఉప కేంద్రానికి సంబంధించిన 11 కేవీ వంశీకృష్ణ నగర్ ఫీడర్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగించడానికి శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ)ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వంశీ కృష్ణ నగర్, కాస్మోక్లబ్, వీఎస్ఎస్ గార్డెన్స్ కల్యాణ మండపం, ఆర్డీఓ కార్యాలయం, డీఎన్నార్ రోడ్డు, హన్సి కల్యాణ మండపం, శ్రీరాంపురం, టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీరవాసరంలో..

వీరవాసరం: 33 కేవీ సబ్ స్టేషన్ కొణితివాడ, మత్స్యపురి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం 11 కేవీ మత్స్యపురి , 11 కేవీ మడుగు పోలవరం ఫీడర్లపై చెట్లు కొమ్మలు తొలగించడం నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశార. ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మడుగు పోలవరం , నేలపోగుల మడుగు పోలవరం లంక గవరపాలెం జొన్నలపాలెం, మత్స్యపురి బొబ్బనపల్లి వడ్డుగూడెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: మండలంలోని రాయలంలో విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం 11కేవీ హైటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉండి: ప్రజలంతా వర్షాకాలంలో సంభవించే అనేక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని భీమవరం సబ్ యూనిట్ అధికారి ఏఎస్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. డాక్టర్ ఐసీ కీర్తన ఆధ్వర్యంలో దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండో రోజు యండగండి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వర్లు, దుర్గాకుమారి, ప్రియదర్శిని పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లిలో రాజు ట్రస్ట్, దళిత ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దళిత విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, గంట రాహుల్ కుమార్, కొండేటి లాజర్ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

భీమవరం: వినాయక చవితి ఉత్సవాల ఏర్పాటు అనుమతులకు పోలీస్ శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. గురువారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు పొందే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ ద్వారా మండపాల నిర్వాహకులు సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీఐ ఎం.నాగరాజు, ఎస్సై కె.మోహన్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఎస్సై ఐ.వీర్రాజు కొమరాడలో పేకాట శిబిరంపై సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.17,140 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డీపీఓ పర్యటన

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జిల్లా పంచాయతీ అధికారి రామనాథరెడ్డి పర్యటించారు. తరటావ, సిద్ధాపురం, అయిభీమవరం, మందపాడు గ్రామాల్లో పర్యటించి మంచి నీరు, పారిశుద్ధ్యం, స్వామిత సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. మందపాడులో పంచాయతీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.